




## "జీవితనాటకంలో అన్ని పాత్రలూ పవిత్రంగా ఉండవ్!"

**మీరు 'రాజా - పేద'** సినీమా చూశారో లేదో నాకు తెలీదు. అందులో ఒక పాట వుంది. ఆ 'పాట'ని మాత్రం ఎప్పుడో ఒకప్పుడు మీరు రేడియోలో విని వుంటారని ఈ పరిశోధకుడి నమ్మకం. 'జిక్కీ' పాడిన ఆ పాట పల్లవి ఇలా వుంటుంది -

'కళ్ళు తెరచి కనరా -

సత్యం ఒళ్ళు మరచి వినరా!

సర్వం నీకే బోధపడురా!"

ఆ పాట పల్లవి సంగతి పక్కనెట్టి - అందులోని ఓ చరణం యొక్క తాత్పర్యాన్ని తమరికి మనవి చేస్తాను.. చిత్తగించండి.

అదృష్టం వక్రిస్తే రాజ్యాలు ఏలే రాజాధిరాజు నిరుపేదగా మారిపోయి, "అమ్మా దానం - అయ్యా దానం" అంటూ అన్నవరం గుడి మెట్ల మీద కూర్చుని అడుక్కునే స్థాయికి దిగిపోవచ్చు. అలాకాక అదృష్టం కలిసొస్తే, అమలాపురం ఆనంద్ భవన్‌లో కాఫీకప్పులు కడుక్కునే ఓ నిరుపేద - కనకపు సింహాసనాన్ని అధిష్టించగలిగే మహరాజు పదవికి ఎదిగిపోవచ్చు."

కానీ -

సదరు అదృష్ట దేవత ఎప్పుడు ఎవర్ని కుడిచేత్తో ఆశీర్వదిస్తుందో ఎవర్ని ఏ సమయంలో ఎడం కాలితో తంతుందో ఎవరూ చెప్పలేరుగాక చెప్పలేరు. ఆ అదృష్టదేవత కృపారస కరుణాకటాక్ష వీక్షణాలను అనుసరించే మనుషుల బతుకులు అఘోరిస్తూ వుంటాయి. పూలమ్మిన చోట కట్టెలమ్ముకునే విధంగా కొందరి బతుకులు పడిపోతే "సింగిల్ బాయిల్డ్ ఎగ్' తినే లెవెల్ నుంచి 'ఫుల్ ప్లేటు చికెన్ సిక్స్టీఫైవ్' తినగలిగే లెవెల్‌కి మరికొందరి బతుకులు టర్నవుతాయి. ఒకనాడు కేవలం అరవై రూపాయలిచ్చే మగవాడికి ఒక రాత్రి తన శరీరాన్ని అమ్ముకునే 'బజారుపిల్ల' రోజుకి అరవైవేలు 'వైట్‌మనీ' సంపాదించగలిగే స్థాయికి చేరుకుందంటే అదంతా అదృష్టదేవత చూపించిన చలవేనని చెప్పక తప్పదు. ఆ అరవై వేలు పగటిపూట సంపాదించే 'వైట్‌మనీ' మాత్రమే..! అదికాక రాత్రిపూట సంపాదించే 'నల్లధనం' లెక్కపెట్టడం మనవల్లకాదు. అది ఎట్లా అంటారా.?

ఈ కథ చదవండి. మీకే సర్వం బోధపడుతుంది.

అనగనగా ఓ అమ్మాయి పేరు ఆశాలత. శ్రీకాకుళం దగ్గర పల్లెటూరు. అక్కడి సింగిల్ టీచర్ స్కూల్లో మూడో తరగతి చదువుతూండగా ఆ పిల్లను 'రంగరాజు' అనే బజారు రౌడీ ఎత్తుకొచ్చి ఏలూరులో వుండే 'గంగాబాయి'కి అమ్మేశాడు. ఎంతకి అమ్మేడో - ఆ వివరాలు తెలియవు.

అప్పటికి ఆశాలత వయస్సు కేవలం తొమ్మిది సంవత్సరాలు. రెండు మూడు రోజులు 'అమ్మ'కావాలంటూ ఏడ్చింది ఆశాలత. మిఠాయిలు కొనిపెట్టి - బొమ్మలు కొనిపెట్టి మరిపించింది గంగాబాయి. వాళ్ళ అమ్మా నాన్న ప్రమాదంలో చనిపోయారనీ, అందుకే

అక్కడకు తీసుకొచ్చారనీ ఆశాలతను నమ్మించింది. కొన్ని నెలలకు ఆశాలత తన తల్లిదండ్రుల్ని పూర్తిగా మరిచిపోయింది. గంగాబాయిని 'పిన్నమ్మా' అంటూ పిలిచేది. అస్తమానూ ఆమె వెనకాలే తిరిగేది. రాత్రి సమయాల్లో ఆమె పక్కలోనే పడుకునేది.

సాధారణంగా పిల్లలకి తల్లితండ్రులు నీతి కథలూ - జాతి కథలూ చెప్తారు. కానీ గంగాబాయి మాత్రం ఆశాలతకి అన్నీ 'అవినీతి' కథలు చెప్పేది. డబ్బుంటే ఎలాంటి సుఖాలు పొందవచ్చునో, ఆ డబ్బుని ఎలా సంపాదించవచ్చునో విడమరచి చెప్పేది.

ఆశాలతకి వయసు వస్తున్న కొద్దీ గంగాబాయి ఆలోచనలు అర్థమవసాగాయి. గంగాబాయి దగ్గర అప్పట్లో మరో ముగ్గురమ్మాయిలు ఉండేవారు. వాళ్ళను అడ్డం పెట్టుకుని అడ్డదారిలో చేసే వ్యాపారం గురించి పూర్తిగా అవగాహన చేసుకుంది ఆశాలత.

తన ఇంటికొచ్చే విటులకు ఆశాలతను పరిచయం చేసేది గంగాబాయి. వాళ్ళు 'ఆశా' బుగ్గగిల్లి, ముద్దు పెట్టుకుని - "నీ పెంపుడు కూతురికి నేనే బోణీ చేస్తాను సుమా?" అంటూ పోటీపడేవారు. చివరకు ఆ రోజు రానేవచ్చింది.

'ఆశా' కోసం అప్పటివరకు ఆశపడుతున్న 'మగరాయుళ్ళ'నందర్నీ ఆ రాత్రి ఆహ్వానించింది. ఆశాకి తెల్లచీర కట్టి, మల్లెపూలతో జడకుట్టి పట్టెమంచం మీద కూర్చోబెట్టింది.

"ఇన్నాళ్ళూ నా సొంతబిడ్డలా పెంచుకొచ్చాను. ఇవాళ మీ సొంతం చేస్తున్నను. ఇవాళ మా 'ఆశా'కి తొలిరాత్రి కనుక మీలో ఎవరు ఎక్కువ పలికితే వారి పక్కలోకి వస్తుంది" అంటూ 'అనౌన్స్' చేసింది గంగాబాయి.

వేలం పాట మొదలైంది. దేవుడిపాట పది రూపాయలతో మొదలై నాయుడి పాట నాలుగు వందలతో ఆగింది. ఆ రాత్రికి నాయుణ్ణే 'ఆశా' దేవుడిగా భావించింది. అతని 'చేతలకీ,' 'చేష్ట'లకీ నిస్సహాయంగా తలవంచింది.

ఆ విధంగా ప్రారంభించిన 'అవినీతి' బ్రతుకుని, అవిచ్ఛిన్నంగా కొనసాగించింది ఆశా.

గంగాబాయి ఆధీనంలో వున్న తక్కిన 'అమ్మాయిలు' వారానికి నాలుగైదు వందలు సంపాదించగలిగితే - 'ఆశా' ఒక్కరోజులోనే ఆ 'లెక్క' తెచ్చి గంగాబాయి చేతిలో పెట్టేది. ఆ విధంగా ఆవిడ అభిమానాన్ని చూరగొంది.

రోజులు... వారాలు.. నెలలు ఏళ్ళూ గడిచిపోయాయి. కేవలం మూడేళ్ళ వ్యవధిలో 'ఆశా' ఆ జిల్లాకంతటికి పేరు తెచ్చుకుంది. మనిషి నల్లగా వున్నా ఆమెలో ఎన్నో అందాలు కుర్రకారుని వెర్రెత్తించేవి. ఆమె కళ్ళు పూలవాకిళ్ళై మత్తెక్కించేవి. ఆ మత్తులో పడ్డ ఓ మదనకామరాజు - "నిన్ను పెళ్ళిచేసుకుంటాను ఈ వృత్తి వదిలిపెట్టి వచ్చేస్తావా?" అని అడిగాడు.

ఆశా ఆలోచించింది. అప్పటికే నాలుగేళ్ళుగా 'ఆ రకం' జీవితంలో లోతుపాతుల్ని చవి చూసింది. తన కళ్ళముందే 'రెండు వందలు' పుచ్చుకున్న 'అమ్మాయి' నాలుగేళ్ళ తరువాత - 'రెండు రూపాయలు'కు దిగిపోవటం గమనించింది.

రేపు తన పరిస్థితి అలాగే కాకూడదని గేరంటి ఏమిటీ..?

గంగాబాయి మాత్రం తనను ఎల్లకాలం ఆదుకుంటుందా? తనలో జవసత్వాలు తగ్గిపోయి 'రేటు' పడిపోతే - మరో 'ఉషా'నో, 'నిషా'నో తెచ్చి అభిమాన కూతురుగా పెంచుకోదన్న నమ్మకం ఏమిటి?

అందుకే 'కాళ్ళదగ్గర కొచ్చిన బేరాన్ని' కాలదన్నుకోకూడదుకుంది. ఆ మదన కామరాజుని పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకుంది. అయితే గంగాబాయి అభిమాన పుత్రికను ఆశీర్వదించవలసిందిపోయి ఆమె ఆలోచనకు అడ్డం పడింది.

రోజుకో బంగారు గుడ్డును పెట్టే బాతును ఒక్కసారిగా కోసుకుని వండుకుతినటం మూర్ఖత్వమనుకుంది. కనీసం పాతికవేలిస్తే ఆ పెళ్ళికి అంగీకరిస్తానని 'మదనకామరాజు'కి మాటిచ్చింది.

చివరికి అక్కడ కూడా వాళ్ళిద్దరి మధ్యా 'వేలంపాట' ప్రారంభమై పదిహేను దగ్గర ఆగింది.

వారం రోజుల తర్వాత పదివేలు గంగాబాయి చేతిలో పెట్టి - ఆమె సాక్షిగానే - 'ఆశా' మెడలో మూడుముళ్ళూ వేశాడు మదనకామరాజు.

మరో నెలరోజుల వ్యవధిలో తక్కిన అయిదువేలూ వడ్డీతో సహా తీరుస్తానని కాగితం రాసిచ్చాడు.

ఆ మర్నాడే ఆశా సమేతంగా బొంబాయి మహానగరం చేరుకున్నాడు మదన్.

ఓ 'హైక్లాస్' హోటల్లో రూం తీసుకున్నాడు. "మీ ఇంటికి ఎప్పుడు తీసుకెడతారు?" అని అడిగింది ఆశా ఆ రాత్రి.

"ముందు పది రోజులు హనీమూన్ తర్వాతే ఇల్లు" అని చెప్పాడు మదన్.

అతని గురించిన వివరాలన్నీ అడిగింది ఆశా.

తన తండ్రి పెద్ద 'బిజినెస్‌మాన్' అనీ ఆయనకు తానొక్కడే సంతానమనీ తనపై ఎన్నో ఆశలు పెట్టుకున్నాడనీ చెప్పాడు మదన్. ఒక్కసారిగా విషయం చెప్పి ఆయన్ని 'షాక్'కి గురిచేయటం కంటే నెమ్మదిగా చెప్పి ఒప్పిస్తానన్నాడు.

అతని మంచి మనసుకి ఆశా కృతజ్ఞతలు తెలుపుకుంది. తన తన నాలుగేళ్ళ 'వ్యభిచార' జీవితంపై నల్ల ముసుగు సరిచేసి స్వచ్ఛమైన మనసుతో అతనికి తన సర్వస్వాన్నీ అర్పించింది.

బొంబాయిలో పదిరోజులు పదినిమిషాల్లో దొర్లిపోయాయి. మదనకామరాజు పర్సులో డబ్బు ఖర్చయిపోయింది.

"ఇంక మనూరు వెళ్ళిపోదాం" అన్నాడు.

"మీ ఇష్టం" చెప్పింది ఆశా.

"నేను బ్యాంక్‌కి వెళ్ళి డబ్బు తెస్తాను. హోటల్‌లో కట్టాల్సిన డబ్బు కట్టేసి సాయంత్రం ట్రైన్‌కి వెళ్ళిపోదాం. బట్టలు సర్దేసుకో" అని చెప్పి ఆ రోజు ఉదయం పదిగంటలవేళ - బయటకు వెళ్ళాడు మదనకామరాజు.

సాయంత్రం నాలుగయింది. పెట్టె సర్దుకుని ప్రయాణానికి సిద్ధమై కూర్చుంది ఆశ. కానీ మదనకామరాజు జాడ కనిపించలేదు.

సాయంత్రం అయిదయింది. ఆశా మనసులో ఆరాటం ఆరంభమైంది.

'బండి ఆరుగంటలకని చెప్పాడు. ఇంకా రాలేదేమిటి చెప్మా? ' అనుకుంది. అసహనంగా అస్తమానూ 'రూం'లోంచి బయటకు చూడసాగింది.

సాయంత్రం ఆరయిపోయింది. ఈసారి ఆశా మనసులో ఏదో అనుమానం తల ఎత్తింది.

'కొంపదీసి నన్ను మోసం చేయలేదు కదా?' క్షణాలు యుగాలు గడుస్తున్న కొద్దీ - ఆమె మనసులో అంకురించిన అనుమానపు బీజం - మహావృక్షమై - మనసును కలచి వేయసాగింది. రాత్రి తెల్లవార్లూ కళ్ళల్లో ఒత్తులు వేసుకుని మదన్ కోసం ఎదురు చూసింది. అయినా నిరాశే ఎదురైంది. ఆ బొంబాయి మహానగరంలో ఎక్కడికని వెళ్ళాలి? ఎలా వెళ్ళాలి? అసలు వెళ్ళాలంటే ముందు హోటల్ బిల్లు చెల్లించాలి. తన పర్సులో పాతికరూపాయలకంటే ఎక్కువ లేవు.

ఆ సాయంత్రం వరకూ మదన్ వస్తాడని ఎదురుచూస్తూనే పరిపరివిధాల ఆలోచించింది. 'మదన్ ఇక రాడు' అని నిర్ణయించుకున్న తర్వాత - హోటల్ మేనేజర్‌ని కలుసుకుని తన పరిస్థితి వివరించింది.

"హోటల్ బిల్లు మొత్తం మూడువేలు దాటింది. 'ఎడ్వాన్స్' రెండువేలు ఇచ్చారు. తక్కిన వెయ్యీ చెల్లిస్తే మీరు వెళ్ళిపోవచ్చు" అన్నాడు మేనేజరు. ఆశా మాట్లాడే తెలుగు మేనేజరుకి తెలియదు. మేనేజరు మాట్లాడే హిందీ ఆశాకీ తెలీదు. ఒకరు మాట్లాడే విషయాన్ని మరొకరికి తెలియ చేయటంలో ఆ హోటల్లో పనిచేస్తున్న ఓ సర్వరు సహాయపడ్డాడు.

"మీ ఆయన కోసం మరో రెండు రోజులు చూద్దాం. అప్పటికీ ఆయన రాకపోతే ఏం చేయాలో ఆలోచిద్దాం" అని సలహా ఇచ్చాడు మేనేజరు.

ఆ రెండు రోజులూ - హోటల్ రూములోనే 'ఖైదీ'లా గడిపింది ఆశా. మూడవరోజు సాయంత్రం హోటల్ మేనేజరు ఆశా గదికి వచ్చాడు. అతని వెంట మరో పెద్దమనిషి కూడా ఉన్నాడు.

"ఈయన మా ప్రొప్రయిటర్‌గారు!" అని పరిచయం చేశాడు మేనేజరు. ఆ ప్రొప్రయిటర్‌కి కాస్తో కూస్తో తెలుగు రావటం వల్ల ఆశాకి కొంత ఊరట కలిగింది. కన్నీళ్ళ పర్యంతమై తన గోడు చెప్పుకుంది. అంతా విన్న హోటల్ ప్రొప్రయిటర్ అడిగాడు –

"మా హోటల్లో డాన్స్ చేస్తావా?" అని. ఆశాకి అయోమయంగా వుంది. ఏం చెప్పాలో తోచలేదు.

"రోజుకి గంటసేపు డాన్స్ చేస్తే వందరూపాయలిస్తాం. హోటల్ రూంలోనే వుండచ్చు. భోజనం ఫ్రీ. ఒక నెలరోజుల్లో నీ అప్పు తీరిపోగా నీకే వెయ్యి రూపాయలు మిగుల్తాయి" ఆశపెట్టాడు మేనేజరు.

'అంతకంటే గత్యంతరం లేదు' అనుకుంది ఆశా.

"కానీ.. నాకు డ్యాన్స్ రాదే?" చెప్పింది వెంటనే.

"డాన్స్ రానక్కరలేదు. సినీమాల్లో చూస్తుంటావ్‌గా! హోటల్లో మ్యూజిక్ వినిపిస్తారు. దానికి తగ్గట్టుగా నువ్వు ఆడితే చాలు!"

కొంచెం అర్ధమైంది ఆశాకి.

మర్నాడు రాత్రి తొమ్మిదిగంటలకు ఆమెను కార్లో – మరో హోటల్‌కి తీసుకెళ్ళారు. అక్కడ తనలాంటి అమ్మాయిలు మరో నలుగురు కనిపించారు. వాళ్ళందరికీ ఆమెను పరిచయం చేసి – 'ఈ అమ్మాయి పేరు ఆశా. మీతోబాటు డాన్స్ చేస్తుంది. ఎలా చేయాలో అంతా వివరంగా చెప్పండి" అంటూ ఆర్డరు జారీ చేశాడు ప్రొప్రయిటర్.

పది గంటలకు ఆ హోటల్లో డాన్స్ ప్రారంభమైంది. అది డాన్స్ కాదు. కేవలం పిచ్చిగంతులు. అందుకే వాటిని ఆ రెండు గంటల వ్యవధిలో చాలా సులువుగా నేర్చేసుకుంది ఆశా.

హోటల్లో అందరూ తాగుతున్నారు. తాగుతున్న వాళ్ళముందు తైతెక్కలాడుతున్నారు. ఆ 'తైతెక్కలాట' పేరు కేబరే డాన్సట. ఆశా తెలుసుకుంది.

వాళ్ళు ఒళ్ళు విరుచుకుంటూ డాన్స్ చేస్తున్నారు. వీళ్ళు ఒళ్ళు తెలియకుండా తాగుతున్నారు. ఓ అరగంట గడిచింది.

ముందు టేబుల్ దగ్గర కూర్చున్న ఓ యాభై ఏళ్ళ పెద్ద మనిషి అప్పటికి మూడు పెగ్గులు తాగి నాలుగో పెగ్గుకి ఆశాని కంపెనీ ఇవ్వమన్నాడు.

అంతకుముందు గంగాబాయ్ కంపెనీలో అలాంటి అనుభవం సంపాదించిన ఆశా ఆశగా అతని పక్కన చేరింది. గ్లాసులో వున్న విస్కీని అతనితో పంచుకుంది.

అతనేదో హిందీలో అడిగాడు.

"నహీ... మై... తెలుగు" అని మూడు ముక్కలు చెప్పింది ఆశా తన మత్తు కళ్ళతో అతనివైపు గమ్మత్తుగా చూస్తూ. అతను బోలెడాశ్చర్య పడిపోయాడు.

"ఓర్నీ! నువ్ తెలుగమ్మాయివా! వండ్రపుల్.." అన్నాడు.

అంత ఆశ్చర్యాన్ని తట్టుకోలేకపోయాడు కాబోలు – తాగిన మత్తంతా దిగిపోయింది. మరో రెండు పెగ్గులు ఆర్డరిచ్చాడు.

"కంపెనీ మందులో మాత్రమేనా? అందులో కూడా ఇస్తావా" అని కొంటెగా అడిగాడు.

"ఎందులో?" అసలే మత్తు కళ్ళు. దానికి తోడు మైకం కూడా ఆవరించటంతో అవి వింతగా మెరిశాయి.

"పొందులో!" తాగుడు 'సిగ్గు శరీరాల్ని' తరిమేస్తుందంటారు. అందుకే అంత ధైర్యంగా చెప్పాడతను.

"కుదర్దు. మా ప్రొప్రయిటర్ ఒప్పుకోడు" గ్లాసులో వున్న చివరి చుక్క కూడా తాగేసి మళ్ళీ డాన్స్ బృందంలో కలిసిపోయింది.

అరగంట తర్వాత డాన్స్ పూర్తయింది. అమ్మాయిలతో బాటు ఆశా కూడా మేకప్ రూముకి వచ్చి బట్టలు మార్చుకుంది. తర్వాత ప్రొప్రయిటర్ ఆమెను మళ్ళీ 'హోటల్ రూం'లో దిగబెట్టాడు.

"భోంచేస్తావా?" అడిగాడు.

తలూపింది ఆశా. "బాగా ఆకలిగా వుంది" అని చెప్పింది.

"రూమ్ నెంబర్ 372లో కారియర్ వుంది వెళ్ళి భోంచెయ్. అంటూ కోటు జేబులోంచి అయిదువంద నోట్లు తీసి ఆమె చేతిలో పెట్టాడు.

"వందేగా ఇవ్వాల్సింది? " నోట్లు లెక్క పెట్టుకుని అడిగిందామె.

"వంద నేనిచ్చింది. నాలుగువందలు అతనిచ్చాడు" ప్రొప్రయిటర్ చెప్పాడు.

అర్థం కాలేదు ఆశాకి.

"ఇందాకా 'బార్'లో నువ్వు కంపెనీ ఇచ్చావ్ చూడు. అతను నిన్ను కావాలనుకుంటున్నాడు. నీకిష్టమైతే వెళ్ళు. ఇష్టం లేకపోతే ఆ నాలుగొందలూ అతనికిచ్చేసి భోజనం చేసి వచ్చేయ్" అంటూ వెళ్ళిపోయాడు ప్రొప్రయిటర్.

ఆశా - రూం నెంబర్ 372లో అడుగుపెట్టింది. 'రూం'లో వున్న అతను చిరునవ్వుతో ఆమెకు స్వాగతం చెప్పాడు.

'పెళ్ళి - భర్త - సంసారం - పిల్లలు' అనే కలల కౌగిళ్ళలోంచి మరోసారి ముళ్ళబాటలోకి జారిపోయింది ఆశా.

"వెయ్యిరూపాయలకి రెండువేలు ఖరీదు చేసే ఆనందాన్నిచ్చావ్" అన్నాడు అతను.

"అంటే మీరు ప్రొప్రయిటర్‌కి వెయ్యి రూపాయలిచ్చారా?" అడిగిందామె.

"అవును నీ రేటు అదేనటగా?" ఆ మాటలు విన్న ఆశాకి ప్రొప్రయిటర్ పట్ల కోపం, అసహ్యం కలిగాయి. వందరూపాయల కోసం లేదా ఒకరోజు బతుకు కోసం ఒళ్ళు అమ్ముకునే తనకూ లక్షల్లో వ్యాపారం చేస్తూ కూడా తన ముష్టిలో కక్కుర్తి పడ్డ ఆ ప్రొప్రయిటర్‌కూ భేదం లేదనుకుంది.

"ఛీ.. దుర్మార్గుడు. మీ దగ్గర వెయ్యి తీసుకుని నా చేతిలో అయిదువందలు పెట్టాడు" చెప్పిందామె.

"అంటే ఇది నీకు కొత్తా?" అడిగాడతను.

ఔనని చెప్పింది.

"నాతో మదరాసు వస్తావా? నీకు సినిమాల్లో వేషం ఇస్తాను" అడిగాడు. తర్వాత ఆ ప్రశ్న ఏదో కొత్తగా ధ్వనించింది ఆమెకు. సినీమాల్లో వేషాలు వేసే తారలకు డబ్బు బాగా వస్తుందని ఆమెకు తెలుసు. చాలాసార్లు గంగాబాయి కంపెనీలో ఉండే అమ్మాయిలు చెప్పుకోవటం వింది కూడా.

"సినిమాల్లో వేషాలు వేస్తే డబ్బు బాగా ఇస్తారా?" అడిగింది అనుమానం తీర్చుకోటానికి.

"ఆహా! అదృష్టం బాగుంటే లక్షలొస్తాయి" చెప్పాడతను.

"నేను సినిమాల్లో బావుంటానా?"

"నువ్ 'ఊ' అన్నావంటే నిన్ను గొప్ప స్టార్‌ని చేస్తాను" మళ్ళీ ఆమె ముందు బంగారు స్వప్నం కనిపించింది.

"వైజయింతిమాల, హేమమాలిని నీకు తెలుసుగా నువ్వు కూడా వాళ్ళంతటిదానవవుతావ్. నేను తాగి చెప్పటం లేదు. నేను ఓ సినిమాని డైరెక్ట్ చేస్తున్నాను. అందులో 'డాన్సర్' కోసం బొంబాయినించి ఎవర్నైనా తీసుకెళ్ళాలని వచ్చాను. నువ్ నాతో వస్తే ముందు ఆ వేషం వేయచ్చు"

ఆశా మనసులో ఎన్నెన్నో ఆలోచనలు ఆ క్షణంలో చోటు చేసుకున్నాయి.

వెళ్ళటమా? మానటమా?

తీరా వెళ్ళాక ఇతను కూడా తనను మోసం చేస్తే?

అయినా ఫర్వాలేదు. తనిప్పుడు అన్నింటికి అలవాటు పడిపోయింది.

ముఖ్యంగా తనను అడ్డం పెట్టుకుని వ్యాపారం చేస్తున్న ఆ హోటల్ ప్రొప్రయిటర్‌కి తగిన బుద్ధి చెప్పాలి.

తన నిర్ణయాన్ని అతనికి చెప్పింది ఆశా. ఆ మర్నాడే హోటల్ ప్రొప్రయిటర్‌కి ఆశా కట్టాల్సిన బిల్లు కట్టేసి విమానంలో మద్రాసు తీసుకొచ్చాడు అతను విమానంలో కూర్చున్నంతసేపూ ఆశా ఆలోచనలు ఆకాశమంత ఎత్తులో విహరించాయి. తాను త్వరలోనే 'హేమామాలినిలా' 'వైజయంతిమాలలా' పెద్ద సినీస్టారు కాబోతోంది. లక్షల్లో డబ్బు సంపాదించబోతోంది. ఆ డబ్బంతా ఏం చేయాలి?

అలా రకరకాల ఆలోచనలు వాటిని అలాగే గుండెల్లో దాచుకుని మద్రాసు మహానగరంలో కాలుపెట్టింది ఆశా.

"ఈ క్షణం నుంచీ నీ పేరు యామిని" అన్నాడు అతను టాక్సీలో కూర్చున్న తర్వాత.

అతని పేరు మీకు చెప్పలేదు కదూ? అవసరమా? అయితే 'అశోక్' అనుకుందాం.

టాక్సీ - అడయార్‌లో వున్న ఓ హోటల్ ముందు ఆగింది.

"రెండు మూడురోజుల్లో షూటింగ్ వుంటుంది. సాయంత్రం నిన్ను చూట్టానికి మా ప్రొడ్యూసర్‌ని తీసుకొస్తాను. ప్రస్తుతం ఈ రెండువేలు అడ్వాన్స్‌గా వుంచు" అని ఓ నోట్ల కట్ట ఆమె చేతిలో పెట్టి - ఆమెను రూములో దిగబెట్టి వెళ్ళిపోయాడు అశోక్.

ఆ రాత్రి బాగా పొద్దుపోయాక ప్రొడ్యూసర్ని తీసుకొచ్చాడు అశోక్. "ఈవిడే యామిని తెలుగమ్మాయే. బొంబాయిలో వుంటూ సినీమాల్లో చిన్న చిన్న వేషాలు వేస్తోంది. మన పిక్చర్‌లో క్లబ్ డాన్సర్ బాగా సూటవుతుందనిపించింది" అంటూ యామిని ఆయనకు పరిచయం చేశాడు.

అంతవరకూ పీకల్దాకా 'స్కాచ్ విస్కీ' తాగొచ్చిన ప్రొడ్యూసరు ఆమెను పరిశీలనగా చూశాడు. నల్లపిల్లయినా - హోటల్ గదిలోని మెర్క్యూరీ దీపాల కాంతిలో ఆమె అజంతా శిల్పసుందరిలా కనిపించింది.

"ఇప్పటికి ఎన్ని సినిమాల్లో చేశావ్?" అడిగాడు. బదులు చెప్పలేక ఇబ్బందిగా చూసింది యామిని. పడగ్గదుల్లో విటుల పక్కన నటించటమే తెలుసు తప్ప వెండితెర మీద ఎప్పుడైనా అసలు కనిపిస్తే కదా - చెప్పటానికి?

ఆమె అవస్థ గమనించిన అశోక్ వెంటనే కలిపించుకుని ఆమెను ఆదుకున్నాడు.

"హిందీ ఫీల్డులో ఇంకా అవకాశాలు రాలేదు. మరాఠీ ఫిలిమ్స్ చేసింది. ఓ పిక్చరు సూపర్ హిట్టయిందికూడా! మంచి డాన్సరు. ఈ అమ్మాయి 'డాన్స్' ఒక్కటైనా లేకపోతే డిస్ట్రిబ్యూటర్లు కొనటంలేదు" హద్దూ పద్దూ లేకుండా అబద్ధం చెప్పేశాడు అశోక్. సినిమాల్లో తనకు అవకాశం రావటానికి అతనంతగా కృషి చేస్తున్నందుకు కృతజ్ఞతగా చూసింది యామిని.

"మనకిక్కడ జ్యోతిలక్ష్మి ఎట్టాగో మరాఠీలో ఈ పిల్ల అట్లా అన్నమాట" అన్నాడు తన తెలివికి తనే మురిసిపోతూ ప్రొడ్యూసరు.

"డాన్స్ డైరెక్టరు ఎలా చెపితే అలా చేయటానికి ఓకె. అంది. ఆ కండిషన్ మీదే తీసుకొచ్చాను" గొప్పగా చెప్పాడు అశోక్.

"మరి రెమ్యూనరేషన్ సంగతి మాట్లాడేవా?"

"అలాంటి విషయాలు మీరే చూసుకుంటారు గదా? రెండువేలు అడ్వాన్సు మాత్రం ఇచ్చాను. ఇక తక్కిన సంగతులు మీరూ ఆవిడా మాట్లాడుకోండి. నేను శెలవు తీసుకుంటాను" అంటూ అశోక్ నిష్క్రమించాడు.

ఆ రాత్రి యామినితో అన్ని విషయాలూ నిస్సంకోచంగా మాట్లాడేశాడు ప్రొడ్యూసరు. 'సెక్స్' వుట్టిపడే ఆమె కళ్ళూ కదలికలూ అతన్ని విపరీతంగా ఆకర్షించాయి.

"అక్కడ నీకు ఏం ఇస్తారు?" రెండు నిమిషాల తర్వాత ప్రశ్నించాడు.

"దేనికి?"

సినీమాలో నటించినందుకు రెమ్యూనరేషన్ ఏం తీసుకుంటుందో తెలుసుకోవాలని ప్రొడ్యూసరు ఉద్దేశ్యం.

ఐతే 'గుమ్మడికాయల దొంగ' అంటే భుజాలు తడుముకున్నట్టు పడక సుఖానికి ఎంత తీసుకుంటున్నదీ చెప్పమని ఆయన అడిగాడేమో అని యామిని భావించింది.

"అదే! మరాఠీ సినిమాల్లో వేషానికి ఎంతిస్తున్నారు నీకు?" ఈ సారి మరింత వివరంగా అదిగాడాయన.

ఎంత చేస్తే ఏం గొడవో అని కొంచెం తటపటాయించిందామె.

"ఒక్కొక్కరు ఒక్కో రేటిస్తారు" గోడమీద పిల్లి వాటంగా బదులిచ్చింది.

"ఇప్పుడు మా పిక్చర్‌లో 'క్లబ్ డాన్స్' ఒక్కటే. రెండు రోజుల్లో అయిపోతుంది. ఓ అయిదువేలిస్తాం. అన్నీ అందులోనే" చెప్పాడు ప్రొడ్యూసరు.

"అయిదువేలు" అనే మాట యామిని చెవులకు సుమధుర సంగీతంలా వినిపించింది.

ప్రతిరోజూ 'ఒళ్ళు హూనం' చేసుకుంటే మహా అయితే ఓ వెయ్యిరూపాయలు కళ్ళు చూసేది ఇదివరకు. అందులో ఓనరు గంగాబాయి దగ్గర్నించీ హోటల్ బోయ్ దిలీప్ వరకూ అందరికీ వాటాలు పంచిపెడితే తనకు మూడువందలు మిగిలేవి. అలాంటిది ఇప్పుడు కేవలం 'ఒళ్ళు' చూపిస్తే చాలు అయిదువేలు 'ఒళ్ళో' వచ్చి పడుతున్నాయి.

"తెలుగు ఇండస్ట్రీలో డాన్సర్లకు మంచి గిరాకీ వుంది. ఈ పిక్చర్‌లో నీ డాన్స్ క్లిక్ అయ్యిందటే నువ్వింక బొంబాయి వెళ్ళక్కర్లేదు. ప్రతి రోజూ పదివేలు ఈజీగా సంపాదించుకోవచ్చు" ఆలోచనలో పడిన యామినిని ఒప్పించే ప్రయత్నంలో ప్రొడ్యూసరు మళ్ళీ అన్నాడు.

"అలాగే సార్. మీ ఇష్టం. కానీ నాకు తెలుగు సినీమాల్లో డాన్స్ చేయటం అంటే అంతగా తెలీదు. కొత్తగా వుంటుంది" వచ్చే అవకాశం చేజారిపోతుందేమోనన్న భయంతో ముందు జాగ్రత్తగా చిన్న బాణం వేసింది యామిని.

"మరేం పరవాలేదు అదంతా మా డాన్స్ డైరెక్టర్ చూసుకుంటాడు కావాలంటే అతన్ని రెండు రోజులు నీ దగ్గరకు పంపుతాను, ముందుగానే నీ చేత గట్టిగా రిహార్సల్స్ చేయిస్తాడు" అంటూనే ఆమెను దగ్గరకు తీసుకున్నాడు.

ఇక బెట్టుచేస్తే బెడిసి కొడుతుందనుకుని అతనికి పూర్తిగా లొంగిపోయింది యామిని.

వారం రోజుల తర్వాత షూటింగ్ ప్రారంభమైంది.

క్లబ్ డాన్సరుగా యామిని ఆ పాత్రలో జీవించింది. సెన్సారు వారి కత్తెర పడకపోతే ఆ డాన్స్ తన చిత్రానికి బంగారు పంటవుతుందని భావించాడు నిర్మాత. అందుకోసమే ముందుగానే జాగ్రత్తలు తీసుకున్నాడు.

సినిమా విడుదలైంది. అందులోని యామిని డాన్స్ కుర్రవాళ్ళు, ముసలివాళ్ళు అనే భేదం లేకుండా మొత్తం పురుష ప్రపంచాన్నే ఓ ఊపు ఊపేసింది. ఆ సినిమా విడుదలై విజయవంతమైన నాలుగువారాల వ్యవధిలో యామినికి మరో నాలుగు ఆఫర్లు వచ్చాయి. రెమ్యూనరేషన్ పెరిగింది. అడ్వాన్సులు చేతిలో పడ్డాయి. అంతవరకూ అశోక్ ఆధీనంలో వుంటున్న యామిని అడయార్‌లో ఓ బంగళా అద్దెకు తీసుకుంది.

జీవితంలో సెక్సు చాలా ముఖ్యం. అవసరం కూడా. సినిమాలు జీవితంలో ఒక భాగమైపోతున్న ఈరోజుల్లో సినిమాలకు కూడా సెక్సు చాలా అవసరంగా మారిపోయింది.

సెక్సును ప్రేరేపించే దృశ్యాల్ని చూపించటం సెన్సార్ నిబంధనలు ప్రకారం నేరమవుతుంది. అయినా వస్త్ర సన్యాసంతోనూ అంగాంగ విన్యాసంతోనూ యువతరాన్ని రెచ్చగొట్టి వాళ్ళ బలహీనతల్ని సొమ్ము చేసుకునే ప్రయత్నాలు రానురాను ఎక్కువవుతున్నాయి.

కోటి రూపాయలు సినిమా నిర్మాణం కోసం ఖర్చు చేసేటప్పుడు మరో లక్షో రెండు లక్షలో విసిరేసి సెన్సారు వాళ్ళ కళ్ళు మూయచ్చుకదా అనే ధోరణి కొంతమంది నిర్మాతల్లో ఏర్పడుతోంది. ఫలితంగా బూతు మాటలే సినిమాలో సంభాషణలుగా పేలుతున్నాయి. శృంగార చేష్టలే స్క్రీన్‌ప్లేగా రూపుదిద్దుకుంటున్నాయి.

ఒకప్పుడు అయిదో పదో (వేలు) డాన్సర్‌కి రెమ్యునరేషన్ ఇచ్చి ఓ అర్ధనగ్న నృత్యం తప్పనిసరిగా చిత్రంలో చొప్పించేవారు. ఇప్పుడిప్పుడు ఆ ధోరణి కూడా మారిపోతోంది.

"ఎలాగూ లక్షల్లో రెమ్యునరేషన్ డిమాండ్ చేస్తున్నారు కదా ఆ బాపతు సెక్సీ డాన్సులు లక్షణంగా హీరోయిన్లు చేతే ఎందుకు చేయించకూడదూ?" అనే ఆలోచన నిర్మాతల్లో కలుగుతోంది.

మొత్తం మీద సెక్స్ డాన్సర్‌గా పేరు తెచ్చుకున్న యామిని 'సెక్సీ బాంబ్'గా తెలుగు చిత్రపరిశ్రమలో స్థిరపడింది. అయిదువేల రూపాయలతో ఆరంభమైన రెమ్యునరేషన్ పదిహేను ఇరవై వేలకు చేరుకుంది. అంతవరకూ పరిశ్రమలో సెక్స్ తారలుగా వెండి తెరను ఏలుతున్న ఒకరిద్దరు తారలుగా మరుగున పడిపోయారు. ఒళ్ళూ, వయసూ పెరిగితే పెళ్ళికి కూడా కాకుండా పోతామేమోనన్న భయంతో దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న మాటకు కట్టుబడి రూపం వుండగానే తాళి కట్టించుకున్నారు కూడా.

ఇక ఇప్పుడు ప్రతి కదలికలోనూ, చూపులోనూ సెక్స్ ఉట్టిపడే యామిని కోసం నిర్మాతలు ఎగబడ్డారు. పత్రికలవారు ఆమె ఒంపుసొంపుల్ని ముఖచిత్రాలుగా ప్రచురించి సర్క్యులేషన్‌ని పెంచుకున్నారు. నిర్మాతల బాక్సాఫీస్ సూత్రానికి మినిమమ్ గ్యారంటీగా వినిపించే పేర్లలో యామిని పేరుకూడా చేరిపోయింది.

వాల్‌పోస్టర్ల మీద హీరో హీరోయిన్ల బొమ్మలతో పాటు యామిని నృత్యభంగిమ కూడా చోటు చేసుకోసాగింది.

ఎంత లావు గుమ్మడికాయ అయినా కత్తిపీటకు లోకువేకదా!

ఏలూరులో అంతకుముందు ఆమెను ఆదరించిన గంగాబాయితో పాటు ఆమెను అనుభవించిన రసిక శిఖామణులుకూడా యామిని ఇంట్లో మకాం పెట్టారు.

సినిమా పరిశ్రమలోకి వచ్చాక ఈ కొద్ది సంవత్సరాలలోనే లక్షలు సంపాదించిన యామిని గంగాబాయిని తనతో వుండమంది. రసిక శిఖామణులందరికీ తన పొందు ఎంత ఖరీదైందో వివరించింది. వాళ్ళంతా చివరకు నిరాశతో వెనుదిరిగారు.

ఓ రోజు పొద్దున్నే మదరాసు మెయిలు దిగిన మదనకామరాజు అడయార్‌లో యామిని వుంటున్న ఇలు వెతుక్కుంటూ వచ్చాడు. అప్పటికింకా యామిని నిద్రలేవలేదు. అయితే ఒకప్పుడెప్పుడో యామినిని పెళ్ళిచేసుకున్నవాడిగా మదనకామరాజుని గుర్తుపట్టిన గంగాబాయి అతన్ని సాదరంగా ఆహ్వానించి కాఫీ ఇచ్చింది.

అతను కాఫీ తాగుతూంటే నిద్రలేచి వచ్చింది యామిని, "మీ ఆయన వచ్చాడమ్మా!" అంది గంగాబాయి.

అతన్ని యామిని వెంటనే గుర్తుపట్టింది. క్షణంలో ఆమె ముఖకవళికలు మారిపోయాయి. ఒకప్పుడు పెళ్ళిచేసుకుని, బొంబాయి తీసుకెళ్ళి హోటల్లో వదిలేసి వెళ్ళిపోయిన అతనిపట్ల ఆమెకు అసహ్యం కలిగింది. అయినా కంట్రోల్ చేసుకుంటూ అడిగింది.

"ఇక్కడికెందుకొచ్చావ్? నేనిక్కడ వుంటున్నట్టు నీకెలా తెలిసింది?" అని.

"సినిమాతారల అడ్రస్సులు తెలుసుకోవటం కష్టమేం కాదుగా! ఇక ఎందుకొచ్చానంటే నీ మీద నాకు హక్కుంది కనక" చెప్పాడతను.

"నన్ను ఏనాడైతే మోసం చేసి బొంబాయి హోటల్లో వదిలేసి వెళ్ళిపోయావో ఆనాడే నా మీద నీకు ఎలాంటి హక్కూ లేకుండా పోయింది" కోపాన్ని నిగ్రహించుకుంటూ చెప్పింది యామిని.

"నేను ఆ రోజు వదిలేసి వెళ్ళిపోయిన మాట వాస్తవమే. పరిస్థితులు అలా వచ్చాయి. ఆ తర్వాత ఇరవై రోజులకు మళ్ళీ హోటల్‌కి వచ్చి నీ కోసం వాకబు చేశాను. నా తప్పు ఒప్పుకుని క్షమార్పణ కోరి నిన్ను నావెంట తీసుకెళ్ళాలనుకున్నాను. కానీ నువ్వు అక్కడ కనిపించలేదు" సంజాయిషీ ఇస్తున్న ధోరణిలో చెప్పాడు అతను.

"ఇప్పుడు ఇంతకాలం అయ్యాక నీ సంజాయిషీలు నేను వినదల్చుకోలేదు. నీకూ నాకూ ఎలాంటి సంబంధం లేదు. నువ్వు వెళ్ళచ్చు" అంటూ లేచింది యామిని.

అతను వెళ్ళలేదు. పైగా ఏమాత్రం బెదరలేదు. నెమ్మదిగా సిగరెట్టు వెలిగించుకున్నాడు. ఆ తర్వాత ఆమెను సమీపించి చెప్పాడు.

"మనది తెంచుకుంటే తెగిపోయే సంబంధం కాదు. మనిద్దరికీ పెళ్ళైయినట్టు నా దగ్గర సాక్ష్యాలున్నాయి. ఇపుడు నీ దగ్గరే వుంటున్న గంగాబాయి ఆనాడు నా దగ్గర పదివేలు తీసుకుని మన పెళ్ళికి ఒప్పుకున్నట్టు కోర్టులో సాక్ష్యం చెపుతుంది. అదీకాక నేనే ప్రెస్‌వాళ్ళనందర్నీ పిలిచి కథంతా చెపుతాను. ఏలూరులో నువ్వు గడించిన అనుభవాలన్నింటినీ కథలు గాథలు రాయిస్తాను."

ఆ హెచ్చరిక విన్న యామిని షాకైంది.

ఇపుడిపుడే పరిశ్రమలో తాను స్థిరపడుతోంది. క్లబ్ డాన్సర్ వేషాలనుంచి కంట్రీ గర్ల్ వేషాల స్థాయికి చేరుకుంది. ఒకపుడెపుడో తన ఒంపు సొంపులకి ఆరువందలు ఖరీదు కడితే ఇపుడు సినీతార ముద్రపడ్డాక ఆ ఖరీదు పదింతలు పెరిగింది. హఠాత్తుగా ఇపుడు తనకు పెళ్ళయిన విషయం బయటపడితే పరిస్థితి అస్తవ్యస్తం అవుతుంది. పైగా సినిమా అవకాశాలు చేజారిపోయే ప్రమాదం ఏర్పడుతుంది. అన్నీ ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చింది. అతనికి యాభైవేలు ఇచ్చి తామిద్దరికి ఎలాంటి సంబంధం లేదని కాగితం మీద రాయించుకుంది.

కేవలం అయిదు రోజుల్లో మళ్ళీ ఆ యాభైవేలూ సంపాదించగలిగింది.

అది వేరే విషయం.

ప్రస్తుతం నగ్నకళను ఆరాధిస్తే వయసున్నంతవరకూ తనకెవరూ పోటీ వుండరన్నది యామిని నమ్మకం, ఆ నమ్మకంతోనే ఆమె అన్నింటికీ తెగించి ముందడుగు వేస్తోంది.

నగ్నత్వానికీ, శృంగారానికీ ప్రాంతీయ భేదాలు లేవు కనుక అన్ని భాషల్లోనూ ఆమె నటిస్తోంది.

'అలాంటి నటనవల్ల మీకు ఆత్మసంతృప్తి కలుగుతుందా?' అని ఎవరైనా అడిగితే

'జీవితమే ఒక నాటకం. ఆ జీవిత నాటకంలో అందరి పాత్రలు పవిత్రంగా ఉండవుకదా?' అని తేలిగ్గా కొట్టిపారేస్తుంది యామిని.

***(వచ్చేనెల మరో కథనం)***

Post your comments

*(పాతికేళ్ళ క్రిందట సితారలో ధారావాహికగా వచ్చిన ఈ కథనాలు*

*రచయిత ప్రత్యేక అనుమతితో పునర్ముద్రణ)*